నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 11 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




# కాల్‌తో ఖతం!

- సీబీఐ, సీఐడీ అధికారుల పేరిట నకిలీ కాల్స్
- 'కేసు నమోదైంది.. అరెస్ట్ చేస్తాం' అంటూ వల
- డ్రగ్స్ మాటున సాఫ్ట్‌వేర్ యువతులకు బెదిరింపులు
- రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేటుగాళ్ల మోసాలు
- అపరిచితులకు డబ్బులిస్తే 1930కు ఫిర్యాదు చేయాలి
- లావాదేవీలను నిలిపివేస్తామంటున్న పోలీసులు

**ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుక్కుంటున్న సైబర్ మాయగాళ్లు**

మహబూబ్‌నగర్, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మీ మీద కేసు నమోదైంది.. వారెంట్ ఇష్యూ అయింది మిమ్మల్ని అరెస్టు చేయడానికి మా పోలీసులు వస్తున్నారు.. వెంటనే లొంగిపోండి.. అంటూ డీజీపీ పేరుమీద ఓ ప్రముఖుడికి కాల్.. మీపై అనుమానం ఉంది.. మీ ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది.. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాం.. అంటూ యువతులకు కాల్స్.. లాటరీ తగిలిందంటూ మెసేజ్‌లు.. సెల్‌ఫోన్‌లో అపరిచితులు పంపించిన మెసేజ్ లింకు ఓపెన్ చేస్తే అకౌంట్‌లో ఉన్న డబ్బులన్నీ మాయం.. ఇవన్నీ నిత్యకృత్యమైంది. తాజాగా పోలీస్ సీబీఐ, సీఐడీల పేరుతో వస్తున్న వాట్సాప్ కాల్స్ జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో చాలామంది బాధితులు ఈ నకిలీ కాల్స్‌కు బలవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ వ్యక్తికి సీబీఐ పేరా ఓ కాల్ వచ్చింది వెంటనే భయపడిపోయి అకౌంట్‌లో ఉన్న డబ్బులన్నీ సమర్పించుకున్నారు. ఒకటి కాదు రెండు కాదు కోటి రూపాయలు బలవంతంగా లాగేశారు. మోసపోయానని తెలుసుకొని లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. మరో యువతికి హైదరాబాద్‌లో ఓ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది అంటూ వచ్చిన ఫోన్ కాల్‌తో ఏకంగా రూ.10 లక్షలు సైబర్ నేరగాళ్లకు సమర్పించుకున్నది. ఇంకేముంది అదంతా ఫేక్ అని తెలియడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఫేక్ కాల్స్‌కు బలవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు వస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని పోలీసులు అంటున్నారు. ఒకవేళ అపరిచితులకు డబ్బులు సమర్పించుకున్న వెంటనే 1930కు కాల్ చేస్తే లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారని పోలీసులు చెబుతున్నారు. మోసపోయాక మాత్రమే బాధితులు స్టేషన్‌కు వస్తున్నారని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో అన్నారు. ఒకవేళ ముందస్తుగా వస్తే అలాంటి నేరగాళ్లను పట్టుకునే వీలుంటుందని జనం అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల పోలీస్ అధికారుల ఫొటోలు తగిలించుకొని ఇంటర్నేషనల్ కాల్స్ వస్తున్నాయి. దీంతో జనం హడలిపోయి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.

### పోలీసులకు సమాచారం ఇవ్వండి



ఈ మధ్య పోలీస్ అధికారుల పేరు మీద నకిలీ వాట్సాప్ కాల్స్ విపరీతంగా వస్తున్నాయి. అరెస్ట్ వారెంట్ అంటూ.. కేసు నమోదైనదంటూ రకరకాల బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇలాంటి కాల్స్‌ను జనం అస్సలు నమ్మవద్దు. ఒకవేళ అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే సైబర్ నేరగాళ్లని పట్టుకోవచ్చు. ఒకవేళ డబ్బులు పోతే వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇస్తే ఆ లావాదేవీలన్నీ ఆపేస్తాం. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ఫేక్ కాల్స్ నమ్మి మోసపోవద్దు. రకరకాల పేర్ల మీద చీటింగ్ చేస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలి.

*- వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్*

### సాఫ్ట్‌వేర్ యువతులే టార్గెట్

సాఫ్ట్‌వేర్ యువతులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇటీవల చాలాచోట్ల డ్రగ్స్ కేసులు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇదే అదనుగా భావించి సాఫ్ట్‌వేర్ అమ్మాయిలను డ్రగ్స్ పేరుతో బెదిరిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే అమ్మాయిలు సాధారణంగా కంపెనీ తరపున ఫ్రెండ్స్ తరపున పార్టీలకు వెళ్లడం సహజం. అయితే పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిందంటూ గాలం వేస్తున్నారు.. అంతేకాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు బెదిరిస్తున్నారు. దీంతో మహబూబ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ అమ్మాయి బెదిరిపోయి సైబర్ నేరగాళ్లకు ఏకంగా రూ.10 లక్షలు సమర్పించుకున్నది. వాట్సాప్ కాల్‌లో డీపీ చూస్తే పోలీస్ ప్రముఖుల ఫొటోలు ఉన్నాయి. ఇంటర్‌నెట్ ఉపయోగించి డీపీలను పెట్టుకొని వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు.

### పాకిస్తాన్ సిరీస్‌తో వాట్సాప్ కాల్స్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల వస్తున్న వాట్సాప్ కాల్స్ జనాలను భయభ్రాంతులను చేస్తున్నాయి. +92 సిరీస్‌తో వస్తున్న నెంబర్లను ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా వాట్సాప్ కాల్స్ పోలీస్ అధికారుల పేర్లు ఫొటోలతో వస్తుండడంతో జనం నిజమైన పోలీసులు అనుకొని నమ్మి కాల్స్ లిఫ్ట్ చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు మీపై కేసులు ఉన్నాయని వారెంట్ ఉందని నకిలీ పత్రాలు అప్పటికప్పుడు సృష్టించి వాట్సాప్ చేస్తున్నారు. ఇది నమ్మి మమ్మల్ని అరెస్టు చేయొద్దు అంటూ బతిమిలాడుతున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు మీ వారెంట్ క్యాన్సల్ కావాలంటే పోలీసులు మీ ఇంటికి రాకుండా ఉండాలంటే ఫలానా అకౌంట్‌కు డబ్బులు పంపించండి అంటూ వెంటనే కాల్స్ చేస్తున్నారు. అంతేకాకుండా తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో బాధితులు పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి అనుమానితుల ఫోన్ కాల్స్ వస్తే వెంటనే ఆ నెంబర్‌ను రిపోర్ట్ స్పామ్ లేదా బ్లాక్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

### రక్షణ కవచంగా '1930'..

సాధారణంగా వాట్సాప్ కాల్స్‌లో పోలీసుల పేరుతో బెదిరించిన ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం సైబర్ క్రైమ్ నేరగాళ్లను కట్టడి చేసేందుకు విస్తృత ప్రయత్నాలు చేస్తోంది. ఒకవేళ ఇలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మి బాధితులు మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి. ఇలా చేస్తే మీరు పంపించిన డబ్బులు ఏ అకౌంట్‌కు అయితే వెళతాయో వెంటనే ఆ అకౌంట్‌ను బ్లాక్ చేస్తారు. నేరుగా బ్యాంక్ సర్వర్లతో లింకు చేసి ఈ లావాదేవీల మొత్తాన్ని ఆపేస్తారు. దీంతో డబ్బులు సైబర్ నేరగాళ్లకు చేరవు. బాధితులు వెళ్లి ఫిర్యాదు చేస్తే తిరిగి ఆ డబ్బులు పోలీసులు అకౌంట్లోకి జమ చేస్తారు.

### రూ.కోటి సమర్పయామి..

అతను సమాజంలో పేరున్న వ్యక్తి.. ఓ రోజు అనుకోకుండా వాట్సాప్ కాల్ వచ్చింది.. ఫలానా పోలీస్ అధికారిని మాట్లాడుతున్న అంటూ ఫోన్ చేశారు. గట్టిగా బెదిరించడంతోపాటు అనేక ఫేక్ డాక్యుమెంట్లను అప్పటికప్పుడే సృష్టించి వాట్సాప్ వెబ్ ద్వారా పంపించారు. ఇది నిజమని నమ్మి అకౌంట్లో ఉన్న రూ.కోటి పంపించి బతిమాలాడారు. వెంటనే డబ్బు చేరగానే ఫోన్ కట్ అయింది. తిరిగి ఆ నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. మరికొద్ది సేపటికి ఆ నెంబర్ అసలు కలవడం లేదు. వచ్చిన డాక్యుమెంట్లను పరిశీలిస్తే అవన్నీ నకిలీవని తేలింది. ఇంకేముంది లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇదంతా ఆలస్యం కావడంతో సైబర్ నేరగాళ్లు బాధితులతో తీసుకున్న డబ్బులను అప్పటికప్పుడే మాయం చేశారు.





# నోట్‌బుక్కులొచ్చాయ్..

- నారాయణపేట జిల్లాకు 3 లక్షలు కేటాయింపు
- రేపటి నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం
- యూనిఫామ్స్, బుక్కులు విద్యార్థులకు అందజేసేందుకు సర్వం సిద్ధం

మక్తల్ టౌన్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడమే కాకుండా నోట్‌బుక్కులుఅందించేందుకు సిద్ధమైంది. వీటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆయా ఎమ్మార్సీ కార్యాలయాలకు తరలించారు. నారాయణపేట జిల్లాలో 378 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 76 ఉన్నత పాఠశాలలు, 11 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, రెండు మోడల్ స్కూళ్లు కలిసి మొత్తం 36 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం మూడు లక్షల నోట్ పుస్తకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోతో చిత్రీకరించి పంపిణీకి సిద్ధం చేసింది. ఈ నెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఇప్పటికే విద్యార్థుల కోసం యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలను సిద్ధం చేశారు. ఆయా పాఠశాలలకు నోట్‌బుక్కులను పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడంతోపాటు అనేక మౌలిక వసతులు కల్పించింది. అదే విధంగా పలు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను కూడా ప్రవేశపెట్టడంతో చాలా గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వం అందించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలను మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పాఠశాలలు ప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించింది. అదే విధంగా పాఠ్య, నోటు పుస్తకాలు కూడా ఉచితంగా అందించడానికి సిద్ధం చేసింది.



విద్యార్థులకు పంపిణీ చేయనున్న నోట్ పుస్తకాలు

### అన్ని మండలాలకు పంపిణీ చేస్తున్నాం..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. అందులో భాగంగా ఇప్పటికే జిల్లా కేంద్రానికి 3 లక్షల నోట్ పుస్తకాలు వచ్చాయి. వీటిని అన్ని మండలాలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ కూడా పాఠశాలలు తెరిచిన వెంటనే అందించేందుకు చర్యలు చేపట్టాం.

*- విద్యాసాగర్, ఏఎంవో, నారాయణపేట*

# బిరబిరా కృష్ణమ్మ..

- కృష్ణానదికి పెరుగుతున్న వరద
- జూరాలకు 3,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆర్డీఎస్‌కు 6,658, టీబీ డ్యాంకు 4,550 క్యూసెక్కుల రాక

మక్తల్, జూన్ 10 : ఎగువ ప్రాంతం నుంచి కృష్ణానదికి వరద వస్తుండడంతో నదిలో నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతున్నది. మూడు రోజుల నుంచి వరద నిలకడగా వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది నుంచి దిగువకు నీరు రాకుండా అడ్డుకునేందుకు కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా బీర్జాపూర్ వద్ద రోడ్‌కం బ్యారేజీ నిర్మించారు. అయితే ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో సోమవారం బీర్జాపూర్ బ్యారేజ్ గేట్లు తెరవడానికి అధికారులు ప్రయత్నించినప్పటికీ గేట్లు మొరాయించాయి. దీంతో వరద నీరు షట్టర్లపై నుంచి సిల్ప్‌వే ద్వారా దిగువకు వస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో మరో రెండు మూడు రోజుల్లో కృష్ణమ్మకు వరద పోటెత్తే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద

***జూరాలకు..***


ధరూరు, జూన్ 10 : ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. సోమవారం ప్రాజెక్టుకు 3,806 క్యూసెక్కులు వస్తున్నది. గతేడాది జూన్ మొదటి వారానికి ప్రాజెక్టులో 4 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.229 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

***ఆర్డీఎస్‌కు..***

అయిజ, జూన్ 10 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు సోమవారం 6,658 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 6,658 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.8 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

***తుంగభద్ర డ్యాంకు..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు స్వల్పంగా వరద పెరుగుతున్నది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు సోమవారం ఇన్‌ఫ్లో 4,550 క్యూసెక్కులు ఉండగా, ఎనిమిది క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. టీబీ డ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 4.581టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1,580.23 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



మక్తల్ మండలం పస్పుల వద్ద కృష్ణానదిలో పెరిగిన నీటిమట్టం





అచ్చంపేట-హైదరాబాద్ ప్రధాన రహదారిపై నడింపల్లి వై జంక్షన్ వద్ద చెట్లను నరికివేసిన దృశ్యం

# నాడు నాటారు.. నేడు నరికారు

- హరితహారం పథకానికి తిలోదకాలు..
- రహదారి వెంట ఏపుగా పెరిగిన చెట్ల తొలగింపు
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రజాధనం దుర్వినియోగంపై సర్వత్రా విమర్శలు

అచ్చంపేట రూరల్, జూన్ 10 : నాటి కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాటు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ మానసపుత్రికగా పిలువబడిన హరితహారానికి శ్రీకారం చుట్టారు. రహదారుల వెంట మొక్కలను నాటేందుకు గ్రామాలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి రూ.కోట్లు ఖర్చుపెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ వాటిని సంరక్షించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహబూబ్‌నగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి, నడింపల్లి వైజంక్షన్‌తోపాటు ఉప్పునుంతల -హైదరాబాద్ రహదారిపై ఏపుగా పెరిగిన చెట్లను పదునైన రంపాలు, మిషన్ల సాయంతో నరికేశారు. కేసీఆర్ హయాంలో ఏటా జూన్, జూలైలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడితే.. కాంగ్రెస్ సర్కారు రావడంతోనే హరితహారం కార్యక్రమానికి పలు చోట్ల విఘాతం కలిగిస్తూ చెట్లను నరికేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారణం ఏదైనా సరే.. ప్రభుత్వాలు మారగానే అధికారుల వైఖరి మారడం అచ్చంపేటలో చర్చనీయాంశంగా మారింది. ప్రజాధనంతో చేసిన పనిని నిర్వీర్యం చేయడంపై ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రహదారులపై మొక్కలను నాటించగా ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. అయితే ఆయా గ్రామాలకు వెళ్లే విద్యుత్ స్తంభాల వైర్లకు అడ్డంగా ఉన్నాయనే కారణంతో సిబ్బంది జేసీబీలతో చెట్లను తొలగిస్తున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇదంతా జరుగుతున్నదని ప్రజలు విమర్శిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

మా శాఖ అనుమతి లేకుండా రహదారుల వెంట ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం. నడింపల్లి వై జంక్షన్ సమీపంలో చెట్ల నరికివేతకు మా శాఖ నుంచి ఎలాంటి అనుమతులివ్వలేదు. మా సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి.. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

*- లక్ష్మీపతి, రోడ్లు, రహదారుల శాఖ సహాయ ఇంజినీర్*

### నెట్టెంపాడ్‌కు నీటిని విడుదల చేయాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాల, జూన్ 10 : నెట్టెంపాడ్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఈఎన్సీ అధికారులను ఫోన్‌లో కోరారు. సోమవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో భారీగా వర్షాలు కురవడంతో నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంలు పూర్తిగా నిండాయని గుర్తు చేశారు. వీటి నుంచి దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు నీళ్లు వచ్చాయని, ఈ ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడ్ లిఫ్ట్-1 ద్వారా నీటిని విడుదల చేయాలని సూచించారు. నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలోని రైతులు నారుమడులు పోసుకుంటారని, ప్రస్తుతం వరి నార్లు పోసుకుంటేనే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు నీటిని విడుదల చేస్తే దాని ద్వారా చెరువులు నింపడంతోపాటు కాల్వలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, వెంటనే నీటిని విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

### బదిలీ ధ్రువపత్రాల పరిశీలన

పాలమూరు, జూన్ 10 : మహబూబ్‌నగర్ జిల్లాలోని భాషా పండితులు, పీఈటీల బదిలీల ధ్రువపత్రాల పరిశీలన సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ధ్రువపత్రాలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్